# సర్వేజనా సుకినోబవంతు!

అల్లుడికి అతికారం యిస్తే అర్ధ రేత్రికాడ గొడుకు పట్టమన్నాడంట!

ఈ మాట ఎవుడన్నాడో ఎప్పుడన్నాడో గానీ చూడబోతే ఈ కాలానికి అటుమంటి అల్లుడే ఎంతో మేలుగా ఉండాది. యాళా పాళా లేకుండా అగిత్తెం ఉండాదా లేదా అని ఆలోచించకుండా గొడుగు పట్టమన్నాడే గానీ యాడంటే ఆడ ఎవుడి ముందరంటే వాడి ముందర కాళ్ల మింద పడి మొక్కమన్లేదే?

ఈ అతికారం ఉండాదే అది గూడా అంతే!

ఎవుణ్ణి చూసి ఎటకారం చేసినా అల్లుడి దగ్గిర మాత్రం అణకువగా మెణకువగా కుక్క మాదిర తోక ముడ్సుకోని పడుంటింది. అటుమంటి అతికారమే చేతికి చిక్కిందంటే ఇంకేముండాది? ఆడిందాట. పాడింది పాట. అంతకింతకూ నిప్పు మింద పణ్ణె ఉప్పుగల్లు మాదిర ఎగిరెగిరి పడే కాకి గుడ్డలు గూడా నంగనాచి టుంగుబుర్రల మాదిర్తో అయిందానికీ కానిదానికీ అన్నింటికీ బుర్ర లాడిస్తానే ఉంటాయి. కారాల్లోకెల్లా ఏ కారం గొప్పదంటే అప్పుడెప్పుడో పోతులూరాయన అతికారం గొప్పదని చెప్పేసినాడు గానీ నేనైతే నుడికారమే గొప్పదందు!

సరే! గెజరాజు గెవిన్లో ఉండగానే గెంటలు యినిపించినట్టు అతికారం అయిద్రాబాద్‌లో ఎలబార్తా ఉండంగానే అప్పుడే ఈడ లేచి ఆడ్తారు. గోసి పేతలు ఎగచెక్కుకుంటా కొందురు. మీసాలు ఎగదువ్వతా యింకొందురు. నిన్ను పట్టు నన్ను పట్టని ముందుకొస్తారు. వొస్తే రానీ ఎవుడబ్బ గంటు పోతింది? అదిగాదే కత. తిత్తిలో రూక తిత్తిలో ఉండంగానే బిడ్డకు కిసురొదిలి పోవాలంటారే? అది గదా బాద! వాళ్ల పెండ్లాల

చేతికి పూల దండలు బిడ్డల చేతికి జండాలిచ్చి యాడ నిలబెట్టుకుంటే ఎవురి సొమ్మేం పోతింది? అట్టా గాకుండా అబం సుబం ఎరగని యిస్కూలు పిలకాయిల మింద పాయ్ పడ్తారే?

ఈ చుట్టు పక్కల ఊళ్లల్లో అయ్యోర్లుండారే? వాళ్ల పిలకాయిలకైతే వానా కాలం చదువు చెప్తా జల్సాగా కాలం నెట్టేస్తా వుండారు. గానీ యిటుమంటి మొనగోళ్ల పోతే వాళ్లకు చదువు చెప్పేదంటే మాట్లా? అదవా ఏ యదవన్నా నోరు తెర్సినాడనుకో! –

''ఏమి అయ్యోరా! బలే కోపు మింద ఉండావే. ఈ ఊరి నీళ్లకు నీకు ఋణం తీరి పొయినట్టుండాదే? మూటా ముల్లె సర్దుకుంటావా?'' అని బెదిరిస్తారు.

దాంతో అయ్యోర్లు అదిరి పడి ఈ కళ్లేడుపు కతలు మనకెందు కనుకోని పిలకాయిల్ను గుంపు తోలుకోని ఎలబార్తారు. తలా ఒక జండా చేతికిస్తారు. అట్టాసం రెట్టమదంగా అతికారం దిగబడబొయ్యే చోట రోడ్డు కిరుపక్కలా సోలుపుగా నిలబెడ్తారు. ఇంక ఆ కసుగందుల కర్మ చూసుకోండేమే? కర్మ సాచ్చి కెరికే!

పోనీ! ఆ వొచ్చే మొనగాళ్లన్నా చెప్పిన యాళకొచ్చి చస్తే పరవాలే. ఇమానం లేటయిందనో... ఇల్లు ఎలబార్తా ఉంటే అల్లుడికి అలక తీర్సాల్సి వొచ్చిందనో... హెలికాప్టర్ సరిగ్గా ఎగరలేదనో– కాసులిచ్చి కొనుక్కోవాల్నా కారణాల్ను చెప్పాలంటే? సవాలచ్చ!

అయినా పాపం! వస్తారొస్తార్లే. తెల్లార్తో వస్తామని చెప్తే మద్దేణం కాణ్ణో... మద్దేణం కాడంటే మావిటేళనో రాకుండా పోర్లే. అరిచ్చెంద్రుడి వారసులుగదా మరి! ఆ యరవ దాకా ఈ కసుగందులు నిలబడి నిలబడి కాళ్లు పీకతా ఉంటే... అట్టా యిట్టా కదల్లేకుండా మినకరిస్తా నీళ్లు లేకుండా గొంతు ఎండక పోతా ఉంటే ఎండన బండ మింద ఆరబోసిన శాప పిల్లలే మేలు గదా? అదే యిస్కూల్లో అయితే ఆ కతే ఏరు? ఈ కాలం పిలకాయిలకు అయ్యోర్ని యామారించేది ఒక లెక్కా పక్కా?

ఎండన పడి కూసోలేక నిలబడలేక అర్సేతిని మొకానికి అడ్డంగా పెట్టుకోని అతికారానికి గొడుగు పట్టాలనే యదవల కోసరం ఈసురోమని నిలబడుకో నుండే ఆ పిలకాయిల్ను చూస్తా ఉంటే కడుపు అట్నే తరక్కపోతింది!

''ఈ రాజకీయ నాయికులంతా యింతే నబ్బా! చెప్పిన యాళకొస్తే వాళ్లు నాయికు లెట్టవతారు?'' అని వొకడంటే–

''నువ్వు చెప్పేది బలే బాగుండాదే? వాళ్లేం మన మాదిర ఎరిముండ్లా? వాళ్లకెన్ని పన్లో ఏమి కతో? మనకంటే యిదొ గిటే పని!'' అంటా యింకొకడు సపోటు పలకతా ఉంటే–

''రొండు మూడు గెంటలే గదా? ఆలస్సెం అయితే ఏమి? ఆరేడు గంటలయితే మాత్రం ఏమి? ఎవుడీ దేశింలో గెడారం కట్టుకోని గెంటల పకారం పని చేస్తా ఉండేది?'' అంటా కాలం యిలవ తెల్సిన మొనగోడు ఎవుడో వొకడు కాలర్ ఎగరేస్తా ఉంటే అసలాయన వొచ్చేస్తాడు. ఇంక చూస్కో– జిందాబాద్‌లు... జేజేలు... జమాయిస్తాయి. ఆ పిలకాయిలు

గూడా సెగితి కాడికి గొంతు చించుకుంటారు. అన్నీ కలగల్సుండే కుందికి అతికారానికి ఒళ్లు పులకరిస్తుంది. గోసి పేతలు ఎగచెక్కినోళ్లు... మీసాలు ఎగదువ్వినోళ్లు బెమ్మానంద పడి పోతా ఉంటే ఆ నాయికుడి పెదాల మింద చిర్నవ్వు మొగ్గ యిడిగినట్లు యిడిగితింది.

పాపం! ఆ పిలకాయిలుండారే? ఆ యరవ దాకా తిండి నీళ్లు లేకుండా ఎండన పడి వొగిరించింది మర్సి పోతారు. 'ఒరే? వొరే? మంత్రి నన్ను చూసి నవ్వినాడు' అని వొకడంటే. 'కాదురా! నన్నే చూసి!' అని యింకొకడు ఎచ్చులు పలకతా ఆడికి తమ జల్మాలే తరించి పాయ్‌నట్టు సంబరపడి పోతారు!

అయ్యో పాపం పిలకాయిలు! రాయలసీమ ఎలిసేండ్లలో వానల్లేకుండా అట్నే ఎండక పాయ్‌న శెనిక్కాయిలు!

మా ఊళ్లో ఉణ్ణె ఎలిమెంట్రీ యిస్కూలు అయిస్కూలుగా అవతారం మార్సుకుణ్ణెప్పుడు కాదు కాదు బోర్డు మార్సుకుణ్ణెప్పుడు అచ్చంగా యిదే మాదిరి జరిగె!

''అన్నా! ఆరో తరగతి చదువుకుండే దానికి మనం నిద్దర లేస్తానే కాలిక్కాలు కొట్టుకుంటా నాలుగు నాలుగు ఎనిమిది మైళ్లు నడిసినాం గదా? ఆ కాలం అట్టుండె. మన కర్మ అట్టా కాలిపాయ. ఈ పొద్దు మన పిలకాయిలన్నా అట్టా పైకెక్కి రానీ. మన తరం ఎట్టా తరం గాకుండా పాయ. ఈ తరమన్నా సుకపణ్ణీ. ఆడ ఈడ బీజారి మొదటి కంతు కట్టేస్తిమి. ఆరంబరం చేసే దానికి సాయానా విద్దా మంత్రి వస్తా నన్నాడు. ఆ పొద్దుటికి నువ్వు గూడా రారాదా?'' అని మా వెంకటరెడ్డి జాబు రాస్తే-

''పరవాలేదే? ఊళ్లో గుడి వొగిటి కట్టాలన కుండా బడి కట్టకుండా ఉండారే మొగలాయిలు. ఇంక మిద్దూరిగ్గూడా మోక్షం వొచ్చేసి నట్టే లెక్క!'' అని ఆలోచించుకుంటా ఆ పొద్దు ప్రారంబోత్సవానికి ఎలబార్తి.

ఓయబ్బో! ఆడికి పాయ్ చూడబోటే ఒక్కొక్కణ్ణి పట్టేదానికే పగ్గాల్లే. పై గుడ్డలు నిలవలా. మొలగుడ్డలు నిలవలా. ఎవుడి నోట్లో యిందామన్నా మంత్రి వచ్చేస్తా ఉండాడు! వచ్చేస్తా ఉండాడు. ఆ అర్బాటం చూస్తా ఉంటే కండ్లు తిరిగిపోతా ఉండాది. ఊళ్లో బారతానికి గ్గూడా అంత పెద్ద పందిలి ఎయ్యరే? ఆ పందిలికి చుట్టు పక్కలుండే చెట్లకు పుట్లకు గూడా సలీసుగా వస్తాయని ఈ సమురులేని దీపాల్ను సరాలు సరాలుగా యాలాడ కట్టేసుండారు!

ఆ రేత్రికి డిన్నరంట. మూడు పొట్టేళ్లు ముప్పయి కోళ్లు తెగె.

ఇంక పలకలు... కొమ్ములు... గెగ్గిరెట్లు... పిళ్లంగట్టెలు... పంబలు... ఈటి కత చూస్తా ఉంటే ముత్తాలమ్మ తిరణాలెందుకు దీని ముందర?

ఏందో చెప్తారే కొండంత రాగం తీసి తుమ్మదీల పాట పాడినట్టు. ఆ ఎలిమెంట్రీ యిస్కూలుణ్ణె మూడంకణాల పూరిల్లు మాత్రం ఎట్టుణ్ణింది అట్నే ఉండాది. పై కప్పుగూడా మార్సలా. లేదంటే బోర్డు! అదొగిటి మార్సినారు. మంత్రి వస్తా ఉండాడని ఉర్దాగా చేసిన సెలవతో ఊళ్లో వాళ్లు చేతులు గలిపిగాన ఉంటే యింకొక మూడంకణాల అడ్డాపిల్లు అలాగ్గా పైకి లేసేసుండు.

ఉడుం ఊళ్లో పెత్తనం చేసినట్టుగా ఆడికి పొయ్ నోరు తెరిస్తే కుక్క సంతకు పొయ్‌న యవ్వారం అయిపోతిందని నా పాటికి నేనొక చోట నిలబడుకోని అంతా గెమనిస్తా ఉండా.

మంత్రి కార్లో వొచ్చె. ఆ కారు ఎనకాల శానా కార్లు జీపులు వొచ్చి ఆ పందిరి కింద నిలబడె. మంత్రి ఒక కాలట్లా నేల మింద ఊన్తా ఉండంగానే జనం మల్లుకుంద్రి. నువ్వు ముందా? నేను ముందా? అంటా దూరి దూరి పూల మాల్లేసిరి.

మంత్రి సంతోస పడిపొయ! పలకలు కొమ్ములు గెగ్గిరెట్లు పంబలు ఆ సంతోసాన్ని ఆకాశానికి ఎత్తేసె. మిద్దూరికి అయిస్కూలు వొచ్చేసె!

అయిస్కూలు వొచ్చేసిదన్న సంతోసంలో ఆ రేత్రి అందురూ తుక్కుగా తాగిరి. మస్తుగా తిన్రి. ఎవురి దోవన వాళ్లు ఎలబారి పొయ్‌రి.

ఆ మర్సటి దినం అదే యాళకు అంత పెద్ద పందిరి ఎట్ట పొయనో పొయ. సముర్లేని దీపాల సరాల్ను యిప్పుకోని వాడెవుడో చంకలో పెట్టుకోని పొయ. పెండ్లి పీట్ల మింద ఉండంగానే మొగుడు చస్తే ముండమోసిన పెండ్లి కూతురు మాదిర ఆ మూడంకణాల పూరిల్లు బిసురోమని నిలబడి పొయ.

చిన్నింట్లో పెద్ద కాపరం చెయ్యమన్నారు పెద్దోళ్లు!

వెంకటాచలం పిల్ల తొట్లతొలీతగా ఆ అయిస్కూలికి తానే హెడ్‌మాస్టర్ అయిపొయ్‌నానన్న సంతోసంలో చిన్నింట్లో పెద్ద కాపరం మొదులు పెట్టె. పెద్ద తరగతి పిలకాయిల్ను మూడంకణాల పూరింట్లోకి తోలేసి చిన్న పిలకాయిల్ను చింత చెట్లకిందకి తరిమేసె.

కూసుండే దానికి బెంచీలా? పాటం చెప్పేదానికి బోర్డులే? మేజాలే? కుర్చీలే? ఏమీ లేకుండానే మిద్దూరికి అయిస్కూలు శాంక్సన్ అయిపొయ.ఏమీ లేకుండా చేసేది గదా మొగలాయి తనం? మన ప్రెబుత్వం యిట్లాంటి పన్లకు పెట్టింది పేరు. ఇంకమిద్దూళ్లో ఆ చుట్టు పక్కల పల్లెల్లో పిలకాయిలు పెనుమూరికి నాలుగు మైళ్లు నడ్సేపని లేకనే అయిస్కూలు చదువులు చదివేస్తారు. ఏమైనా ఈ కాలం పిలకాయిలు అదురుష్టమంతులు. కాలు కదిలించే పన్లేకనే చదువుల తల్లి గడపలకాడికి నడిసొస్తా వుండాది. అనుకుంటా తిరపతికి తిరుక్కోని వస్తి. ఎవురేడ పోతే నాకేం అనుకుంటా కాల సెక్రం దాని పాటికది నిలికి లేకుండా తిరగతానే ఉండాది. ఈ బతుకనే ఎతల రొంపిలో గొంతల కాడికి కూరక పొయ్యే కుందికి ఎప్పుడు పొద్దు పుడతా ఉండాదో ఎప్పుడు పొద్దు పోతావుండదో కూడా తెలవకుండా నెలలు వారాలుగా వారాలు దినాలుగా దొర్లిపోతా ఉండాయి. దీంట్లోపడి కొట్టుకోని పోతా ఉంటే ఒక దినం నిద్దర్లేస్తా ఉండంగానే వెంకటరెడ్డి నెత్తిన చేతులు పెట్టుకోని కంట పడె.

తెల్లార్తాళకే ఈడు ఊడి పణ్ణాడే? ఏం కత ఎత్తుకోని వచ్చినాడో? ఏంపాడో? అనుకుంటానే–

''ఏమిరా అబ్బోడా?'' అంటే–

''కడుపు మంట కాపరానికి రేచీగిటి మొగుడన్నెట్టు అయిపాయ గదన్నా యవ్వారం''

''నీ కాపరాని కేమిరా? లెక్కాశారంగా మీరిద్దురు. మీ కిద్దురు! అంతో యింతో కయ్యాగాలవ. చేతులో యిరుపు-'' నా మాట ముడువు గాకుండానే.

''ఊరికే ఉండకుండా దోవన పొయ్యే దాన్నెత్తి నెత్తి నేసుకోని బతుకు నడీది పాలై పొయ్యేటట్టుగా ఉండాది గదన్నా?'' అనె.

మనమంతా మన పెద్దోళ్ల ఋణం ఎట్టా తీర్సుకోబోతామో ఏం పాడో గానీ అసలు కత కాడికి రాకుండానే కతలు మాట్లాడే దానికి నేర్పించి పొయ్‌నారు. అదే అనుకుంటా-

''ఏమి జరిగిందో చెప్పకుండా ఏమేమో చెప్తే ఎట్రా?'' అంటే-

''ఊళ్లో ఒక అయిస్కూలుంటే బాగుణ్ణు అనుకోని...''

''అనుకుండే దేందిరా? అనుకుణ్ణెట్టుగానే యవ్వారం మంత్రి శాతల మిందనే బెమ్మాండంగా జరిపిస్తివే?''

''ఇప్పుడా మంత్రే రొండో కంతు ఎంటనే చెల్లించకుండా పోతే రికగ్నిషన్ రాదని రాయిపించినాడు.''

''కట్టాల్సిందే కదా మల్లా?''

''యాడ దెచ్చి కట్టమంటావ్? తొలి కంతు కట్టే కుందికే బతుకు చావుజంపులైపాయ. వానాలే వంగుడు లే. బతుకు గడిసేదే వొక గగనంగా ఉంటే మలి కంతు కట్టమంటే! రూకలియ్యండ్రా అంటే యిచ్చే వాడెవుడన్నా?''

''ఇప్పుడు ఊళ్లో బారతమో ముత్తాలమ్మ తిరణాలో జరిపించాలని పంపకాలేస్తే''

''నాయాండ్లు అటుమంటి దాన్కైతే చచ్చి దుగ్గడైనా సమాళించి కట్టేస్తారు. అందాకా ఎందుకన్నా? మొన్న ఆ సర్పంచి ఎన్నిక లొచ్చినపుడు పోటీ లేకుండా ఎవుణ్ణో వొకణ్ణి ఎన్నుకోనుంటే వాడిచ్చే దుడ్లతోనే రొండో కంతేంది? మూడో కంతు కూడా కావాలంటే కట్టి పారేసి ఉండచ్చు. యిద్దురు నిలబడ్తానంటా వుంటే ఎట్నో వొకట్టా వాళ్లకు రాజీ కుదిరిద్దా మనుకుంటా ఉంటే వాడుండ్లా తలకాడ గుండు. రెడ్డోరి రగునాదుడు. వాడు యింకొకణ్ణి నిలబెట్టె. ఊళ్లల్లో మిగల నేర్సిన నాయాండ్లుండా? 'నా ఓటు నీకే' నంటా ముగ్గురి తావన పెరుక్కోని ముక్కుల దాకా తాగి తాగి తందనా లాడిరి. అటుమంటి యదవలే ఈ పొద్దు యిస్కూలికి రికగ్నిషన్ రాలేదంటే తలా వొక మాటంటారు. బతుకు బయిశాట్ల పాలై పోతింది. దానికన్నా ఉరు బోసుకోని చచ్చేది మేలు!''

''అయితే యిప్పుడు నన్నేం చెయ్‌మంటావురా?''

''చేసేదే ముండాదన్నా? పదాం పద. ఊరు మింద పడదాం. నువ్వే చెప్తా ఉంటావు గదా? కలిగినోడికి కాళ్లుండాయి. మనకు చేతులుండాయి అని. చందాలన్నా వసూలు చేద్దాం. యిస్కూలికంటే ఈ కుండా పోతారా?''

వాడి మాట కాదనేది ఎందుకని ఎలబార్తి!

నాలుగ్గాళ్లమండపం కాడికి పొయ్యే కుందికి ముత్తారెడ్డన్న ఎదురు పడె!

''అన్నా! మన మహన్నబావులు పల్లెల్లో చింత చెట్ల కింద అయిస్కూళ్లు ఆర్భాటంగా ఆరంబరం చేసేదెందుకు? డొనేషన్లు కట్టమని వాళ్ల పాణాలు తోడేదెందుకు? ఆ పల్లె కొంపల్లో బతికేదే దినగెండంగా ఉంటే ఇట్టా బొరువు మోసే దానికి వాళ్ల వల్ల అవితిందా? చదువు కోసరం అంటే దుడ్లుండవు గానీ బుద్దుడి యిగ్రహం చెయ్‌పించాలంటే కోట్లకు కోట్లు దుడ్లకు కొదవుండదు. బుద్దుడి యిగ్రహం పెడతానే అందురికీ బుద్ది వొచ్చేసేటిగా ఉంటే ఈ దేశింలో ఉండే యిగ్రహాల్తో దర్మం నాలుగు పాదాల మింద నడవాల్సిందే గదా?''

''అయితే ఈ మాత్రం వాళ్లు ఆలోచించ లేదనా నువ్వు అనుకుండేది?''

''ఆలోచించే వుంటే దానాల్లోకెల్లా విద్దా దానం గొప్పదంటారే? మల్లా దానికే సుంకం చెల్లించ మని యిట్టా మాదిర యిగ్రహాలు పెడ్తారంటావా?''

''ఒరే పిచ్చోడా! మన ముక్కెమంత్రి నీ మాదిర నా మాదిర పిచ్చోడు గాదురా. శానా దూరం ఆలోచించే ఈ పని చేసె. బుద్దుడేమని చెప్పినాడ్రా? కోరికలే అన్ని అనర్తాలకు మూలమని చెప్పినాడా లేదా? చెప్పినాడు. కదా? ఆయన్ను చూసి నేర్చుకోమని మన ముక్కెమంత్రి యిప్పుడా పని చేసింది. పాపం! ఆయన మాత్రం ఏం చేస్తాడు. కోరిన కోరిక మల్లా కోరకుండా వొక్క మోపన పాయ్ నెత్తిన పడ్తా ఉంటే-''

''ప్రజలారా! మీ మేలు గోరి నేనీ బుద్దుడి యిగ్రహాన్ని పెడ్తా ఉండా. ఆ మహన్నబావుడు చెప్పింది జాగర్తగా మననం చేసుకోండి. యింకా బాగా అర్తం చేసుకోండి. కోరికల్ను జయించండి. అప్పుడు తీర్సలేదన్న బాద మాకు తీరలేదన్న బాద మీకు ఉండదు- అని అన్న ఆలోచించి గదా ఆ పని చేసింది'' అనె.

ఇంతకూ యింత దూరం ఆలోచించిన అన్న డిల్లీకి పోవాలన్న కోరిక జయించి నాడా? అన్న సందేహం కలిగె. టాంక్ బండ్ మింద బుద్దుడు నిలబడ్తే చెప్తాడేమో చూడాల మల్లా?●

సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం
కడప వారికి —— బహూకృతి